విద్యుత్‌తో జరభద్రం

- వర్షాకాలంలో పొంచి ఉన్న ప్రమాదాలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న విద్యుత్ శాఖ అధికారులు


దుబ్బాకలో విద్యుదాఘాతంతో మృతి చెందిన గేదె(ఫైల్)

ధర్పల్లి: వర్షాకాలంలో విద్యుత్ వినియోగదారులు విద్యుత్ పరికరాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. అప్రమత్తంగా ఉంటే విద్యుత్ ప్రమాదాలను నిరోధించవచ్చు. కురుస్తున్న వర్షాలకు భూమి పూర్తిగా తడిసిపోతుంది. దీనికి తోడు గాలి దుమారంతో విద్యుత్ తీగలు తెగిపడుతున్నాయి. నిర్లక్ష్యంగా ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రమాదాల నివారణకు విద్యుత్ అధికారులు అందిస్తున్న తగిన సలహాలు, సూచనలు ఇవి..



తడి చేయితో స్విచ్‌లు వేయొద్దు

టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషిన్, గ్రైండర్లు, మిక్సీలు, వాడేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. తడి చేయితో స్విచ్‌లను ఆన్‌చేయొద్దు. అసెంబుల్ ఉపకరణాలు ఉపయోగించే కంటే బ్రాండెడ్ పరికరాలు వాడితే మంచిది. సెల్‌ఫోన్లు చార్జింగ్ పెట్టే సమయంలో జాగ్రత్తగా ఉండాలి.

ట్రాన్స్ ఫార్మర్లకు దూరంగా ఉండాలి

వర్షాలు కురుస్తున్నప్పుడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు చాలా దూరంగా ఉండాలి. కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయలేదు. దీంతో వాటి పక్క నుంచి నడిచినా విద్యుత్ షాక్‌కు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. చాలా పశువులు రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాతపడుతున్నాయి. ఈదురుగాలులు వీచినప్పుడు కూడా తీగలు తెగిపోయి మీదపడే అవకాశాలు ఉన్నాయి.

సమాచారం ఇస్తే మేలు

ట్రాన్స్‌ఫార్మర్లలో మంటలు రావడం, విద్యుత్ తీగలు తెగిపోవడం వర్షాకాలంలో జరుగుతుంటాయి. కొన్నిచోట్ల రైతులే మరమ్మతులు చేస్తుంటారు. ఇలా చేయడం సరికాదు. ఎట్టి పరిస్థితుల్లో ఇలాంటి పనులు చేయొద్దు. విద్యుత్ సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలి. విద్యుత్ పరికరాలకు దూరంగా ఉంటూ ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

వ్యవసాయ బావుల వద్ద

వర్షాకాలంలో బోరుమోటార్లు వేసేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. స్టార్టర్ వద్ద తీగలు సరి చూసుకోవాలి. తెగిపోయి వేలాడే తీగలను ముందే గుర్తించాలి. ఒక్కోసారి విద్యుత్ తీగలు తెగిపోయి ఉంటాయి. వీటిని ముట్టినప్పుడు షాక్‌కు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. స్టార్టర్ డబ్బాలను సురక్షిత ప్రాంతాల్లో అమర్చుకోవాలి. స్టార్టర్ వద్దకు వెళ్లేటప్పుడు చెప్పులు, చేతికి తొడుగులు ధరించాలి. అవి పాడైతే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటు మెకానిక్‌లకు చూయించాలి.

విద్యుత్ స్తంభాలతో జాగ్రత్త

వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలకు కూడా కరెంటు ప్రవహిస్తుంది. వ్యవసాయ బావుల వద్ద, గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన స్తంభాలకు దూరంగా ఉండాలి. చిన్న పిల్లలను వీటి వద్దకు వెళ్లనీయకుండా చూడాలి. ఇళ్లలో కూడా తడి చేతులతో స్విచ్‌లను వేయొద్దు. తడి గోడలను ముట్టుకోవడం మంచిది కాదు. ఉతికిన దుస్తులు ఆరవేయడానికి మహిళలు ఇంట్లో తీగలు ఏర్పాటు చేసుకుంటారు. ఇవి విద్యుత్ వైర్లకు తాకకుండా చర్యలు తీసుకోవాలి. ఇళ్లపై నుంచి హైటెన్షన్ వైర్లు ఉంటే వర్షం కురుస్తున్నప్పుడు ఇంటి పైకి ఎక్కకపోవడం మంచిది.

క్లుప్తంగా

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ఇందల్వాయి: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డిచ్‌పల్లి సీఐ వినోద్, ఇందల్వాయి ఎస్సై సందీప్ అన్నారు. మత్తుపదార్థాల వాడకం వల్ల జరిగే అనర్థాలపై ఇందల్వాయి గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇందల్వాయి పోలీసులు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సైలు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుల్లో చక్కగా రాణించి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. స్మార్ట్ ఫోన్లు వాడుతూ సోషల్ మీడియాకి ఆకర్షితులై సైబర్ మోసాలకు గురి కావద్దన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



మోపాల్: పాఠశాలల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి గోవింద్‌రావు సూచించారు. శుక్రవారం మండలంలోని కంజర్ శివారులో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో ఎంపీడీవో రాములు నాయక్‌తో కలిసి మండల ప్రత్యేకాధికారి తనిఖీ చేశారు. శానిటేషన్, తరగతి గదులు, పరిసరాలు, వంట గదిలో నిత్యావసర వస్తువులు, కూరగాయలు, బియ్యం పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపాల్ విజయ లలితకు సూచించారు. వారి వెంట ఒడ్డెరకాలనీ జీపీ కార్యదర్శి నర్సింహులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అకడమిక్ అంశాలపై సెమినార్



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో 'విద్యా రచనలు, ప్రాజెక్ట్ నివేదికలు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. డిగ్రీ, పీజీ విద్యార్థులు ఇలాంటి పరిశోధన అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ముఖ్య వక్తలుగా విచ్చేసిన జాన్ సుకుమార్, శ్యాం కుమార్ పరిశోధన పద్ధతులు, నివేదికలు రూపొందించడంలో మెలకువలపై అవగాహన కలిగించారు. అనంతరం వక్తలను అధ్యాపకులు సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం, రాజేశ్, రామస్వామి, ప్రతిభ, నాగజ్యోతి, లావణ్య, రాజశేఖర్, దస్తప్ప, నిఖత్ ఫాతిమా, వసంత్ జాదవ్, స్థితప్రజ్ఞ, విద్యార్థులు, పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతి

నిజామాబాద్ సిటీ: నగరంలోని అమ్మ వెంచర్ వాసులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వెంచర్ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతోందని అన్నారు. రెంజర్ల నరేశ్, ఎండల కిషన్, బొబ్బిలి కిషన్, మాడవేడి వినోద్‌కుమార్, దగ్గుల మధుసూదన్, యెండల సందీప్, ఈశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

మోపాల్: మండలంలోని తాడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శ్రీరామ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 22 మంది విద్యార్థులకు బ్యాగులు, స్టీల్ వాటర్ బాటిళ్లను శుక్రవారం పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు టి శ్రీనివాస్, టి రామ్మోహన్, రాజశేఖర్, బాలశేఖర్, డి అమర్, నల్ల నగేశ్, హెచ్ఎం దేవానంద్, ఉపాధ్యాయురాలు జయ శ్రీ పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	98,200	వెండి(కిలో)	1,11,500
22 క్యారెట్స్	90,650	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	28	60	గాజరుగడ్డ	30	60
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	60	90
బీరకాయ	50	80	దోసకాయ	20	40
దొండకాయ	30	60	ఆలుగడ్డ	30	50
జిర్రిసుకాయ	100	150	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిపువ్వు	40	60
వంకాయ	40	60	బీట్‌రూట్	30	60
పాలకూర	50	80	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	30	50
కొత్తిమీర	30	50	చిక్కుడుకాయ	50	80
పుదీనా	60	90	గోరుచిక్కుడు	30	60
క్యాప్సికం	50	90			

-సుభాష్‌నగర్

దొడ్డి కొమురయ్య పోరాటం మరువలేనిది


కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు


డిచ్‌పల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు


నివాళులర్పిస్తున్న ఏఐపీకేఎంఎస్, మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు

సాక్షి నెట్‌వర్క్: వెట్టిచాకిరి విముక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పోరాటం మరువలేనిదని పలువురు వక్తలు అన్నారు. నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో దొడ్డి కొమురయ్య వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పలుచోట్ల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్: ప్రభుత్వ విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పెద్ది సూరి కోరారు. ఈమేరకు శుక్రవారం యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పెద్ది సూరి మాట్లాడుతూ.. బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకానికి మూడేళ్లుగా నిధులు విడదల చేయకపోవడంతో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నగర కార్యదర్శి మహేశ్, నాయకులు మారుతి, వేణు, తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి



మోపాల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని ఎంపీడీవో రాములు నాయక్ సూచించారు. శుక్రవారం మోపాల్ మండలంలోని కులాస్‌పూర్ నర్సరీలో వన మహోత్సవం ప్రారంభోత్సవ ఆహ్వాన సదస్సును ఫారెస్ట్ అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మండలంలోని 21 గ్రామపంచాయతీల్లో 3 వేల చొప్పున మొక్కలు నాటేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి గోవింద్ రావు, ఎంపీవో కిరణ్‌కుమార్, ఏపీవో సునీత, ఫారెస్ట్ సెక్షన్, బీట్ ఆఫీసర్లు, టీఏలు, జీపీ కార్యదర్శులు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

విద్యార్థులు భాషలపై పట్టు సాధించాలి



నిజామాబాద్ రూరల్: విద్యార్థులు భాషలపై పట్టు సాధించి, మహనీయుల జీవితాలను అధ్యయనం చేయాలని ఆర్ఎస్ఎస్ దక్షిణ క్షేత్ర సేవా ప్రముఖ్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం శివాజీనగర్‌లో ఉన్న శ్రీరామకృష్ణ హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. గణితంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శాస్త్రీయ దృక్పథాన్ని, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సముద్రాల శ్రీనివాసాచార్యులు, మధుసూదనాచార్యులు, శశిరేఖ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా యూత్ స్పోర్ట్స్ అధికారికి సన్మానం



నిజామాబాద్ నాగారం: జిల్లా యువజన క్రీడల అధికారిగా నియామకమైన పవన్‌కుమార్‌ను శుక్రవారం పాతకలెక్టరేట్‌లో యోగా అసోసియేషన్ ఆఫ్ నిజామాబాద్ జిల్లా సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది రాజ్‌కుమార్‌సుబేదార్, ఐశ్వర్యశ్రీ, పవీన్‌కుమార్, గంగాధర్, కమలవాణి, యోగా సభ్యులు లోహిదాస్, సంగీత, రామచందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడాకారిణికి..



సిరికొండ: మండలంలోని హుస్సేన్‌నగర్‌కు చెందిన జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారిణి గుండెల మేఘనను సిరికొండకు చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సన్మానించారు. జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనందుకు అభినందించారు. ఆసిఫ్, శోభన్, దిగంబర్, రాము పాల్గొన్నారు.

కళాశాలల బంద్ విజయవంతం

నిజామాబాద్‌అర్బన్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం పీజీ, డిగ్రీ కళాశాలలను బంద్ చేయించారు. కార్యక్రమంలో నాయకులు జన్నారపు రాజేశ్వర్, నిఖిల్, మనోజ్, సాయికిరణ్, దుర్గాప్రసాద్, వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల/కళాశాలలో 6, 7వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 7, 8, 9వ తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పడిగల దశరథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్య ఆయుధం లాంటిది

ధర్పల్లి: ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య అని, విద్య ఆయుధం లాంటిది అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో శుక్రవారం 'రోల్ మోడల్ టు గర్ల్స్ స్టూడెంట్స్'అనే అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

నియామకం



నిజామాబాద్‌నాగారం: బీసీ సంక్షేమ సంఘం నగర ప్రధాన కార్యదర్శిగా కొట్టూరు చంద్రకాంత్ శుక్రవారం నియామకం అయ్యారు. నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న మేరు సంఘం భవనంలో చంద్రకాంత్‌కు జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ నియామక పత్రాన్ని అందజేశారు. బీసీ సంక్షేమ సంఘాన్ని బలోపేతం చేయడంలో కృషి చేస్తున్న చంద్రకాంత్ నగర ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుస్స ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పొల్కం గంగకిషన్, నగర అధ్యక్షుడు దర్శనం దేవేందర్, ఆకుల ప్రసాద్, కరిపె రవీందర్, కొయ్యాడ శంకర్, శ్రీలత, అజయ్, చంద్రమోహన్, విజయ్ సాయి బసవ, చంద్రకాంత్, విజయ, సదానంద్, హన్మంత్‌రావు, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి



నిజామాబాద్ రూరల్: రైతులకు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయాధికారి హీరాజాదవ్ అన్నారు. శుక్రవారం మాధవనగర్ సొసైటీ గోదామును తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, ఈ–పాస్‌లో ఎరువుల అమ్మకాల నమోదు, విత్తన నిల్వలను పరిశీలించారు. మాధవ్‌నగర్ సొసైటీకి అవసరమైన యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులు ఎలాంటి కొరత లేకుండా రైతులకు అందించాలని సూచించారు. సొసైటీ చైర్మన్ దాసరి నాగేశ్వరరావు, సీఈవో వంశీకృష్ణ ఉన్నారు.

ఇందల్వాయి సొసైటీలో..



ఇందల్వాయి: మండలంలో సాగవుతున్న పంటల అవసరాలకు మేర యూరియా సరఫరా చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ తెలిపారు. ఇందల్వాయి సొసైటీలో యూ రియా అమ్మకాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ–పాస్ యంత్రాల ద్వారానే రైతుల ఆధార్ వివరాలు నమోదు చేసి ఎరువుల అమ్మకాలు జరపాలని సిబ్బందికి సూచించారు. మండలంలోని రెండు సొసైటీలు, ప్రైవేటు డీలర్స్ ద్వారా ఇప్పటివరకు 950 మెట్రిక్ టన్నుల యూరియాను విక్రయించినట్లు తెలిపారు. రైతులు పంట పొలాల అవసరాల మేరకే యూరియా వాడాలన్నారు. పరిమితికి మించి యూరియా వాడొద్దని సూచించారు. ప్రస్తుతం మండలంలో పరినట్లు మొదలయ్యాయని తెలిపారు.

నేటి చిత్రం

వెలగని హైమాస్ట్ లైట్లు



మోపాల్: నగర శివారులోని బోర్గాం(పి) చౌరస్తాలో హైమాస్ట్ లైట్లు వెలుగడం లేదు. దీంతో ఆ ప్రాంతంలో చిమ్మచీకట్లు కమ్ముకుంటున్నాయి. రాత్రి సమయంలో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు, పాదచారులు కోరుతున్నారు.

– రచ్చ ఆనంద్, బోర్గాం(పి)

మాకు ఫొటో పంపండి – మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

నిజామాబాద్ అర్బన్ - 95531 30597 | నిజామాబాద్ రూరల్ - 97053 46541

అంగన్‌వాడీ కేంద్రంలో పిచ్చిమొక్కలు



చైతన్యనగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు, కేంద్రం వద్ద కనిపించిన పాము

- సమీపంలో తిరుగుతున్న పాములు
- భయాందోళనలో చిన్నారుల తల్లిదండ్రులు

డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్ గ్రామం చైతన్య నగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరగడంతో పాములు సంచరిస్తున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రం వద్ద నాగుపాము కనిపించడంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నపిల్లలకు ఏదైనా ప్రమాదం జరగకముందే పంచాయతీ సిబ్బంది స్పందించి పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

హైదరాబాద్ తరలిన కాంగ్రెస్ నాయకులు


హైదరాబాద్‌కు వెళ్తున్న నాయకులతో ఎమ్మెల్యే భూపతిరెడ్డి


డీసీసీబీ వైస్ చైర్మన్, డీసీసీ ప్రధాన కార్యదర్శి, నాయకులు

సాక్షి నెట్‌వర్క్: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ సమ్మేళనం కార్యక్రమంలోభాగంగా గ్రామ అధ్యక్షులు, కాంగ్రెస్ క్రియాశీలక కార్యకర్తల సమావేశానికి నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం తరలివెళ్లారు. జిల్లా కేంద్రం నుంచి కాంగ్రెస్ భవన్‌కు 5 బస్సులు, 50 కార్లు, పలు వాహనాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు.


మోపాల్ మండల కాంగ్రెస్ నాయకులు


సిరికొండ నాయకులు


డిచ్‌పల్లి నాయకులు


ధర్పల్లి నాయకులు

బాలికలను వేధిస్తే కఠిన శిక్షలు తప్పవు


మాట్లాడుతున్న ఎస్సై యాదగిరి గౌడ్

మోపాల్: మహిళలు, బాలికలపై అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు వేధింపులకు గురి చేస్తే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై యాదగిరి గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం సీపీ ఆదేశాల మేరకు మండల కేంద్ర శివారులోని ప్రెసిడెన్సీ స్కూల్‌లో షీ టీం సభ్యులు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆటోల్లో ప్రయాణించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. షీ టీం సభ్యులు స్రవంతి, రేఖ రాణి, శ్రీకాంత్, ప్రిన్సిపాల్ పవన్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సురేశ్, అకడమిక్ కో ఆర్డినేటర్ రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



నిజామాబాద్ సిటీ: నగరంలోని పలు డివిజన్లలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను డిప్యూటీ కమిషనర్ రవిబాబు శుక్రవారం పరిశీలించారు. జోన్–4ఏ, జోన్–4బీ లలో జరుగుతున్న శానిటేషన్ పనులు పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. మున్సిపల్ ఉద్యోగుల హాజరు, గూపన్‌పల్లి, ఖలీల్‌వాడీ, రైల్వేకమాన్, గంజ్ కమాన్‌లలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయన వెంట శానిటరీ ఎస్సైలు షాదుల్లా, కృష్ణ ఉన్నారు.